# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2.** **విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.**

**3.** **రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

**4.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమవుతుంది.**

**5.** **టీ20 క్రికెట్ వరల్డ్‌కప్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈ రోజు ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్ లబ్దిదారులకు బహిరంగ లేఖ రాశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం కోసం తొలి రోజు నుంచే నిర్ణయాలు తీసుకుంటున్నామని అన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పింఛన్‌ను వెయ్యిరూపాయలకు పెంచి ఇస్తున్నామని, జులై 1 నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్దే అందిస్తామని తెలిపారు. పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా 819 కోట్ల రూపాయల భారం పడుతున్నప్పటికీ ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంపును వర్తింపచేసి అందిస్తున్నామని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు.

--------------------------

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.వెలగపూడి సచివాలయంలో నిన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చేపట్టాల్సిన మార్పులు, ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. న్యాయ వివాదాలను పరిష్కరించి, అధ్యాపక నియామకాలకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విశ్వవిద్యాలయాల రేటింగ్ పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు అధ్యయనం చేసి, వివరాలు సమర్పించాలని చెప్పారు. ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాల మెరుగుకు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్

కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రవేశాల పెంపుదలకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులతోపాటు గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వివరించింది. ఈ రోజు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

---------------------------

విజయవాడ రైల్వే డివిజన్ లోని వివిధ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు మోసగిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చినట్లు విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రైల్వే శాఖలో ఉద్యోగాలకు సంబంధించిన సమాచారమంతా ఎప్పటికప్పుడు రైల్వే అధికారిక వెబ్‌సైట్లలో తెలియజేస్తామన్నారు. రైల్వే ఉద్యోగాల కోసం అభ్యర్థులు దళారులను ఆశ్రయించవద్దని పేర్కొంటూ....

వాయస్ (35) సెకన్స్

---------------------------

రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ, విదేశాల ప్రజలతో తన మనసులోని ఆలోచనలను పంచుకుంటారు. ప్రతి నెల రేడియో కార్యక్రమంలో భాగంగా ప్రసారమయ్యే 111వ సంచిక ఇది. నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రసారమయ్యే తొలి మన్ కీ బాత్ సంచిక ఇదే. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్వర్క్ లు, ఏఐఆర్ న్యూస్ వెబ్సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్ లో ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్నిఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో మన్ కీ బాత్ అనువాదం ప్రసారం అవుతుంది.

---------------------------

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ –సీఆర్‌పీసీ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత–బీఎన్ఎస్ఎస్ చట్టం జులై 1 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో అందులోని వివిధ సెక్షన్ల కింద పోలీసులకు అధికారాలను దఖలుపరుస్తూ రాష్ట్రప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీచేసింది. అరెస్టయినవారి పేర్లు, వారి చిరునామాలు, సమాచార సేకరణ, ఆ రికార్డుల నిర్వహణ కోసం ప్రతి జిల్లాకు ఒక పోలీసు అధికారిని, ప్రతి పోలీసుస్టేషన్‌లో ఏఎస్సై హోదా కంటే తక్కువ కాని అధికారిని నియమించుకునేలా ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసు అధికారులు, సిబ్బందికి బీఎన్ఎస్ఎస్ చట్టాల్లోని అంశాల ప్రకారం అధికారాలు ఇస్తూ ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి వి.సునీత నిన్న వేర్వేరు ఉత్తర్వులు జారీచేశారు.

---------------------------

నూతన నేర చట్టాల అమలు పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను సవరించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, సాయుధ తిరుగుబాటు, వేర్పాటు వాదం, ఐక్యతకు

భంగం కలిగించే వంటి అంశాలపై తగిన చెర్యలు తీసుకునేలా చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. సవరణ చేసిన చట్టాలు జూలై1వ తేదీ నుంచి అమలు చేస్తుండడం స్వాగతించదగ్గ విషయమని తిరుపతికి చెందిన న్యాయవాది పాదర్తి రమణ ఆకాశవాణికి తెలుపుతూ...

వాయిస్ (40) సెకన్స్

---------------------------

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్ డీఎస్ ఈ రోజు కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా సేవలందించారు. పీసీసీ అధ్యక్షుడిగానూ ఆయన పనిచేశారు.డీఎస్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు.ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు.

---------------------------

జాతీయ పరీక్ష సంస్థ- ఎన్టీఏ ఇటీవల రద్దు చేసిన ఎన్సీఈటీ, సీఎస్ఐఆర్- యూజీసీ-నెట్, యూజీసీ-నెట్, పరీక్షల కొత్త తేదీలను ప్రకటించింది. జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష -ఎన్సీఈటీని జూలై 10న నిర్వహిస్తామని ప్రకటించింది. అలాగే వాయిదా పడ్డ సీఎస్ఐఆర్- యూజీసీ-నెట్ ను జూలై 25 నుంచి 27 వరకు, యూజీసీ-నెట్ పరీక్షలను ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 4 వరకు ఆన్లైన్ విధానంలో నిర్వహిస్తామని ఎన్టీఏ తెలిపింది. తదుపరి సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ సందర్శించాలని ఎన్టీఏ సూచించింది.

---------------------------

పురుషుల టీ20 క్రికెట్ వరల్డ్‌కప్ లో భాగంగా బార్బడోస్ లోని బ్రిడ్జ్‌టౌన్ వేదికగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈ రోజు ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. భారత కాలమానం ప్రకారం మ్యాచ్ ఈ రోజు రాత్రి 8 గంటలకు ప్రసారమవుతుంది.ఈరోజు జరిగే ఫైనల్ మ్యాచ్ తో పురుషుల టీ20 క్రికెట్ వరల్డ్‌కప్ ముగుస్తుంది. కాగా భారత్ చివరిసారి టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను 2007లో గెలిచింది.

---------------------------

రాష్ట్ర ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నియమితులైన సిబ్బంది, అధికారులకు ఒక నెల స్థూల జీతాన్ని గౌరవ వేతనంగా ఇవ్వాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన వారికి ఒక నెల జీతం గౌరవ వేతనానికి తగ్గట్టుగా రసీదులు తయారు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

---------------------------

ముగ్గురు అఖిల భారత సర్వీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. పులివెందుల ప్రాంతాభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రత్యేక అధికారి బి.అనిల్ కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయల కార్పొరేషన్ ఇన్కాప్ ఎండీ నీలకంఠారెడ్డి, సంప్రదాయేతర ఇంధన వనరులు కార్పొరేషన్ ఎండీ నంద కిషోర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిని సాధారణ పరిపాలన శాఖకు రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

====================